# రామోజీరావు మృతి బాధాకరం

- సంతాపం తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల, మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 8 : అతి సామాన్య కుటుంబంలో జన్మించి, అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మృతి బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం తెల్లవారుజామున రామోజీరావు మృతి చెందారనే విషయం తెలియడంతో ఆవేదనకు గురయ్యారు. ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో బతికారని, తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, విలువలు జోడించిన వ్యక్తని కొనియాడారు. సినిమా, వినోద రంగానికి ఆయన అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. రామోజీ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలో రామోజీరావును కలిసినప్పటి ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

***రామోజీ ఖ్యాతి మరొకరికి అసాధ్యం : బండ్ల***

గద్వాల, జూన్ 8 : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు సంపాదించిన గొప్ప ఖ్యాతి మరెవరికీ సాధ్యపడదని.. అలాంటి మహోన్నత వ్యక్తి మృతి చెందడం బాధాకరమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అత్యున్నత స్థాయికి ఎదిగారని.. జీవితాంతం నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్నారన్నారు. పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వకారణంగా నిలిచాయని కొనియాడారు. తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీ చిరస్మరణీయులని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

***సేవలు చిరస్మరణీయం : చిట్టెం***

మక్తల్, జూన్ 8 : రామోజీరావు మరణం రెండు తెలుగు రాష్ర్టాల ప్రజలకు ఎంతో బాధను మిగిల్చిందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. రామోజీరావు మరణించిన విషయం తెలియడంతో శనివారం మక్తల్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామోజీరావు అసామాన్య విజయాలు సాధించారని అన్నారు. పత్రికను స్థాపించి జర్నలిజానికి, సినిమా, వినోద రంగంలో ఆయన సేవలు చెరగని ముద్ర వేశాయన్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జూరాలకు వరద

ధరూరు, జూన్ 8 : మూడురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జూరాలకు వరద చేరుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. శనివారం 3,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ప్రస్తుతం 1,033.646 అడుగుల నీటినిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

***ఆర్డీఎస్‌కు..***

అయిజ, జూన్ 8 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు శనివారం 6,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 6,658 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.8 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

***తుంగభద్ర డ్యాంకు..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద చేరుతున్నది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు శనివారం 1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 10 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. టీబీ డ్యాం 100.855 టీఎంసీలకు గానూ 3.942 టీఎంసీలు నిల్వ ఉన్నది. 1,633 అడుగులకు గానూ 1,578.86 అడుగులకు చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

# ఏ దిల్ మ్యాంగో మోర్..

- నోరూరిస్తున్న కొల్లాపూర్ మామిడి
- విదేశాల్లోనూ అధిక డిమాండ్
- దేశంలోని ఇతర రాష్ర్టాలకు ఎగుమతి
- విక్రయాల్లో కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం

## వనపర్తి నుంచే 2,400 టన్నుల దిగుబడి

ఈ ఏడాది మామిడి సీజన్ అంతంత మాత్రంగానే ఉన్నది. అయినప్పటికీ ఒక్క వనపర్తి జిల్లా నుంచే ఈ సీజన్‌లో 2,400 టన్నుల మామిడి దిగుబడి ఉన్నట్లు ఉద్యానవన శాఖాధికారుల అంచనా.. సీజన్ బాగా లేకపోవడంతో సగం తోటల్లో మాత్రమే కాపు నిలబడింది. ప్రస్తుతం మామిడి కోతలు.. విక్రయాల సీజన్ జోరుగా సాగుతున్నది. ఏప్రిల్ నుంచి మామిడి సీజన్ ప్రారంభం కాగా.. తోటలు అధికంగా ఉన్న జిల్లాల నుంచి ఇతర ప్రాంతాలకు కాయలు, పండ్లు తరలుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంగానే ప్రస్తుత మార్కెట్ కొనసాగుతున్నది. ప్రతి రోజూ 200 మెట్రిక్ టన్నుల నుంచి మొదలుకొని అత్యధికంగా 600 మెట్రిక్ టన్నులకుపైగా మామిడి వస్తున్నది. ప్రస్తుత మార్కెట్‌లో టన్ను మామిడికి రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు ధర పలుకుతున్నది. అయితే ప్రారంభంలో కేజీ మామిడి రూ.200 ధర పలకగా.. 20 కేజీల బాక్స్‌కు రూ.4 వేల ధర వచ్చింది. ఈ ధరలు ముందస్తుగా కాత వచ్చిన రైతులకు మాత్రమే అందడంతో ఎక్కువ లాభసాటిగా నిలిచింది.



నోరూరిస్తున్న కొల్లాపూర్ మామిడి పండ్లు

వనపర్తి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : కొల్లాపూర్ మామిడి.. ఈ పేరు చెబితే నోరూరాల్సిందే.. రుచికరమైన పండ్లకు ఈ ప్రాంతం పేరొందింది. నియోజకవర్గంలో ఎక్కడా చూసినా మామిడి తోటలే కనిపిస్తాయి. ఈ ప్రాంత పండ్ల కోసం ఎందరో ఎదురుచూస్తుంటారు. విదేశాలతోపాటు జాతీయ స్థాయిలో ఇక్కడి పండ్లు గుర్తింపు పొందాయి. బుట్టలు, బాక్స్‌ల్లో ఇక్కడి నుంచి పండ్లను రైతులు ఎగుమతి చేస్తుంటారు.

***కొల్లాపూర్ బంగారం..***

చూసేందుకు పచ్చని వర్ణంలో నిగనిగలాడుతుంది. రుచిలో అమృతాన్ని తలపిస్తున్నది. పోషకాల్లో యాపిల్ కంటే ఏమాత్రం తీసిపోదు.. అందుకే కొల్లాపూర్ మొదలు దేశవిదేశాల్లోని ప్రజలు ఈ పండు రుచి కోసం పరితపిస్తారు. కొల్లాపూర్ మామిడి అంటేనే కొత్త బంగారంలా భావిస్తారు. నాణ్యతలోనూ ప్రత్యేకతను సంతరించుకున్నది. ఇందుకు కారణం నియోజకవర్గంలోని నేలలు తోటలకు అనుకూలంగా ఉండడం.. మార్కెట్‌లో పండ్లకు డిమాండ్ ఉండడంతో రైతులు సాగుకు మొగ్గు చూపుతారు.

***ఎన్నో రుచులు..***

కొల్లాపూర్ మామిడికి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ డిమాండ్ ఉండడంతో ప్రాధాన్యత పెరుగుతుంది. కొల్లాపూర్ మామిడిలో కేసరి, హిమాయత్, మల్లిక, దసేరి, తోతాపురి, మాల్‌గోవా, నీలంతోపాటు పలు రకాలు ఉన్నాయి. మొత్తం సాగులో 80 శాతానికిపైగా కొల్లాపూర్ మామిడి రకాలే ఉంటాయి. దీన్ని బట్టి వీటికి ఉన్న ప్రాధాన్యత ఇట్టే అర్థమవుతున్నది. ఇక్కడి నేల స్వభావంతో పండ్లు తీపిదనంగా ఉంటాయి. సంస్థానాల కాలం నుంచి వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో మామిడికి ప్రాధాన్యతనిచ్చారు.

ఇక్కడి వాతావరణ పరిస్థితులతో కాయలు మంచి ఆకారంతోపాటు పరిమాణం కూడా పెద్దగా ఉంటాయి. ఒక్కోటి 200 గ్రాముల నుంచి 500 గ్రాముల సైజ్‌లో.. గుండ్రని ఆకారం, బంగారం, పసుపు మిశ్రమ వర్ణంతో ఉంటుంది.

***ఉమ్మడి జిల్లాలో 66,500 ఎకరాల్లో..***

ఉమ్మడి జిల్లాలో సుమారు 66,500 ఎకరాల్లో మామిడి తోటల పెంపకం ఉన్నది. కొత్త జిల్లాల వారీగా.. నాగర్‌కర్నూల్‌లో 36 వేల ఎకరాలు, వనపర్తి జిల్లాలో 16 వేల ఎకరాల్లో తోటలు సాగులో ఉన్నాయి. కొల్లాపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, జడ్చర్ల, కల్వకుర్తి ప్రాంతాల్లో విస్తారంగా ఉన్నాయి. పాలమూరు జిల్లాలో 6 వేలు, నారాయణపేటలో 3,500, జోగుళాంబ గద్వాల జిల్లాలో 4 వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. రాష్ట్రంలోని జనగాం, వరంగల్, ఖమ్మం, వికారాబాద్, మహబూబాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లోనూ విస్తారంగా సాగవుతున్నది.

***విదేశాల్లోనూ భలే డిమాండ్***

కొల్లాపూర్ మామిడి పండ్లకు దేశ, విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉన్నది. సింగపూర్, ఫ్రాన్స్, మలేషియా, యూకే, అమెరికా, సౌదీ, గల్ఫ్ దేశాలకు కొల్లాపూర్ బంగినపల్లి ఎగుమతి అవుతుంటుంది. ఎక్స్‌పోర్టు ఏజెన్సీల ద్వారా నాలుగైదేళ్లుగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నది. అయితే బాగా రంగు, సైజ్, రుచి ఉన్న పండ్లనే పంపిస్తుంటారు. క్వాలిటీ తక్కువగా ఉన్న మామిడి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్తున్నది. వీటితోపాటు దేశంలోని కర్ణాటక, ఢిల్లీ, ఇతర రాష్ర్టాలకు కొల్లాపూర్ మామిడిని పంపిస్తున్నారు. అంతటి పేరొందిన కొల్లాపూర్ మామిడికి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

***ప్రభుత్వ ప్రోత్సాహం కరువు..***

ఈ ఏడాది మామిడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. కేసీఆర్ ప్రభుత్వంలో సెర్ప్ ఆధ్వర్యంలో మామిడి కొనుగోలును చేపట్టి బాసటగా నిలిచింది. రైతుల తోటల వద్దనే కొనుగోలు చేస్తూ కిలోకు రూ.35 నుంచి రూ.45 వరకు అందజేసింది. మార్కెట్‌లో వీటిని విక్రయించిన అనంతరం వచ్చిన లాభాలను కూడా సెర్ప్ ద్వారా రైతులకు పంపిణీ చేసిన సందర్భాలున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రసుతం ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం.. ప్రకృతి పరంగా తేనే మంచు, నల్లతామర పురుగు ధాటికి చాలా తోటలు కాపునకు నోచుకోలేదు.

కేవలం సగం తోటలకు మాత్రమే ఈ ఏడాది అనుకూలంగా ఉన్నాయి. వచ్చిన దిగుబడులను రైతు లు నేరుగా విక్రయించారు. ధరలు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి.



బాక్స్‌ల్లో నిల్వ చేసిన మామిడికాయలు



మామిడిని బాక్స్‌లో నింపుతున్న మహిళ


